సాక్షి
మెదక్

మంగళవారం ; 17 ; అక్టోబర్ ; 2023



బీఆర్‌ఎస్‌లో విభేదాలు

కుకునూరు మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో గ్రూపు రాజకీయాలు భగ్గుమన్నాయి.

వివరాలు 10లో ▸



నర్సాపూర్‌లో అయోమయం

నర్సాపూర్ నియోజకవర్గంలో ఏ రాజకీయ పార్టీ కూడా అభ్యర్థులను ప్రకటించలేదు.

వివరాలు 10లో ▸

ఓబీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా సలీం

రామాయంపేట(మెదక్): ఓబీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా నార్సింగి మండల కేంద్రానికి చెందిన సలీం ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కోటేశ్వర్ రావు నియామకపత్రం అందజేశారు.

న్యూస్‌రీల్

మంత్రి పరామర్శ



రాజశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న హరీశ్‌రావు

రామాయంపేట(మెదక్): సీఎం వ్యక్తిగత కార్యదర్శి పెంటపర్తి రాజశేఖర్‌రెడ్డి తల్లి రత్నమ్మ (80) అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా సోమవారం ప్రగతి ధర్మారంలో మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీసీపీ కమల హాసన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, యాదగిరిరెడ్డి ఉన్నారు.

ఫిర్యాదులు చట్టప్రకారం పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను విన్నవించారు. రెండేళ్ల క్రితం పక్షవాతం రావడంతో నన్ను నా భార్యాపిల్లలు చంపే ప్రయత్నం చేస్తున్నారని పాపన్నపేట మండల కేంద్రానికి చెందిన ఇమ్మానియల్ ఫిర్యాదు చేశాడు. భర్త చనిపోవడంతో మా అత్త తమ్ముడు బర్మావత్ బాల్య. అతని అనుచరులైన బానోత్ మహి, బానోత్ రాజులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొడిపల్లి మండలం దేవులపల్లి తండాకు చెందిన మెగావత్ అనిత తన గోడు తెలిపింది. స్పందించిన అదనపు ఎస్పీ.. ఫిర్యాదుదారులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. వీటితోపాటు పలు ఫిర్యాదులు వచ్చాయి.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన వ్యాన్

చేగుంట(తూప్రాన్): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న మినీ వ్యాన్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరీశ్ తెలిపారు. సోమవారం వాహన తనిఖీల్లో భాగంగా బోనాల్ చౌరస్తాలో 27 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు పట్టుకుని విచారించారు. దేవాగౌడ్ అనే వ్యక్తి తక్కువ ధరకు గ్రామాల్లో బియ్యం కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిసింది. వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మేనిఫెస్టోను కాపీ కొట్టిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. సోమవారం కౌడిపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమర మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు ప్రజల్లోకి వెళ్లాయని, దీంతో బీఆర్‌ఎస్‌కు దిక్కుతోచని పరిస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్ల ప్రభుత్వంలో ఉండి చేయని అభివృద్ధి మరోసారి గెలిపిస్తే చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, టీపీసీసీ డెలిగేట్స్ ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గండి యాదాగౌడ్, నాయకులు నారాయణరెడ్డి, ధన్‌సింగ్, రఘు, రమేష్ పాల్గొన్నారు.

బస్తీమే సవాల్


- పద్మ గెలుపునకు మంత్రి. కొడుకు విజయానికి ఎమ్మెల్యే వ్యూహాలు
- ఒకరిపై మరొకరు ఘాటైన విమర్శలు



బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్



మెదక్: ఎన్నికలు వచ్చాయంటే ఆయా పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల మధ్య మాటల యుద్ధం జరగడం సర్వసాధారణం. ప్రచారంలో ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుంటారు. లోపాలు ఎత్తిచూపుతూ ఓటర్లను మచ్చిక చేసుకుంటుంటారు. అయితే మెదక్ నియోజకవర్గంలో మాత్రం ఇందుకు భిన్నంగా ఎలక్షన్ ఫైట్ జరుగుతోంది. అభ్యర్థులను పక్కన పెట్టి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ముఖ్య నాయకులే బస్తీమే సవాల్ అంటున్నారు. కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్న మైనంపల్లి రేవంత్ గెలుపు కోసం తండ్రి హన్మంతరావు తీవ్రంగా శ్రమిస్తుండగా.. అదేస్థాయిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి విజయం కోసం మంత్రి హరీశ్‌రావు వ్యూహాలు రచిస్తున్నారు. సిద్దిపేట నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా హరీశ్, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థిగా హన్మంతరావు పోటీ చేస్తున్నప్పటికీ.. మెదక్ క్యాండెట్లు అనే రీతిలో రాజకీయం చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో మెదక్‌పై అందరి దృష్టిపడేలా విమర్శలు చేసుకుంటున్నారు.

కొడుకు గెలుపు కోసం..

మెదక్ బీఆర్‌ఎస్ టికెట్ తన కొడుకు రేవంత్‌కు వస్తుందని ఆశించి భంగపడిన హన్మంతరావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశాడు. మల్కాజ్‌గిరి అభ్యర్థిత్వాన్ని వదులుకుని మరీ కాంగ్రెస్‌లో చేరి రెండు నియోజకవర్గాల నుంచి టికెట్లు సాధించారు. రోహిత్ గెలుపు కోసం నియోజకవర్గంలోని పాపన్నపేట, మెదక్, చిన్నశంకరంపేట తదితర మండలాల్లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. మండలాల నాయకులు, వివిధ సంఘాల మద్దతు కూడగట్టుకుంటున్నారు. బీఆర్‌ఎస్ అసంతృప్తులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు. ఈ సమయంలో మంత్రి హరీశ్‌పై మైనంపల్లి ఘాటైన విమర్శలు చేశారు. మెదక్ వెనుకబాటుకు కారణం హరీశ్‌రావే కారణమని, సిద్దిపేట అభివృద్ధిలో దూసుక పోతుంటే ఇక్కడ ఎందుకు వెనుకబాటుకు గురైందని, మెదక్ నుంచి ఇప్పటికే చాలా ప్రభుత్వ కార్యాలయాలను సిద్దిపేటకు తరలించాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవినీతి మంత్రుల అంతు చూస్తామని హరీశ్‌రావును ఉద్దేశించి మాట్లాడారు.

అదేస్థాయిలో ఎటాక్..

మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బరిలో నిలిచారు. ఆమె గెలుపుకోసం హరీశ్ మెదక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కాంగ్రెస్‌ను వీక్ చేసేందుకు టికెట్ ఆశించి భంగపడిన డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి వంటి నేతలను కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారు. వారితో పాటు పలువురు హస్తం నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సమయంలో ఇటీవల మెదక్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మైనంపల్లి పై హరీశ్ ఘాటైన విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ నుంచి గూండాలు డబ్బు సంచులతో వస్తున్నారని, వారిని గెలిపిస్తే అభివృద్ధి శూన్యమని, సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్యానించారు. కరోనా సమయంలో కనిపించని వారు ఇప్పుడు వచ్చి సేవ చేస్తామంటున్నారని ఆరోపించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కనిపించరని, అలాంటి వారిని నమ్మొద్దని విమర్శించారు.

● గాయత్రీదేవి అలంకారంలో..



పాపన్నపేట(మెదక్): దేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఏడుపాయల దుర్గమ్మ గాయత్రీదేవి (బ్రహ్మచారిణి)అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున వేద బ్రాహ్మణులు సనాతన శర్మ అమ్మవారిని గులాబీ రంగు వస్త్రాలతో అలంకరించారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన పూజల్లో పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం మెదక్ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కాగా మంగళవారం అమ్మవారు చంద్రఘంట(అన్నపూర్ణ)అలంకారంలో దర్శనమిస్తారు.

శాంతిభద్రతలకు సహకరించాలి



అల్లాదుర్గంలో కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ పోలీసులు

మెదక్ డీఎస్పీ ఫణీందర్

పెద్దశంకరంపేట(మెదక్): శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని మెదక్ డీఎస్పీ ఫణీందర్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్‌ఐ బాలరాజు తదితరులున్నారు.

అల్లాదుర్గం(మెదక్): ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అల్లాదుర్గంలో వీధుల్లో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించింది.కార్యక్రమంలో ఆర్‌ఏఎఫ్ డీఎస్పీ శశాంక్, మెదక్ డీఎస్పీ ఫణీందర్, అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

దుబ్బాక, నర్సాపూర్ పై సవతి తల్లి ప్రేమ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నర్సాపూర్: బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రాన్ని పదేళ్లుగా దోచుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఏర్పడక ముందు పేదోళ్లుగా ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు.. అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములు, ఇసుక ఇతర ఆస్తులు అమ్ముకుని ఆర్థికంగా ఎదిగారని విమర్శించారు. వాళ్లని మళ్లీ గెలిపిస్తే ఉన్నవన్నీ అమ్మేస్తారని తెలిపారు. గత ఎన్నికలప్పుడు సీఎం కేసీఆర్ నర్సాపూర్ నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు కాళేశ్వరం నీళ్లు ఇస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చాడని చెప్పారు. కానీ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. జిల్లాకు చెందిన మంత్రి హరీశ్‌రావు దుబ్బాక, నర్సాపూర్ నియోజకవర్గాలపై సవతి తల్లి ప్రేమ చూపుతారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు ఏ పార్టీకీ అమ్ముడుపోరని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ బూత్ అధ్యక్షులు సరిగ్గా పని చేస్తే వంద మంది హరీష్ రావులు, వెయ్యిమంది కేసీఆర్‌లు వచ్చినా బీజేపీని గెలుపును ఆపలేరని ఆయన తెలిపారు. అనంతరం కౌడిపల్లి మండలం పీర్యా తండా సర్పంచ్ లచ్చానాయక్‌తోపాటు ఆయా పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పార్టీ పరిశీలకుడు ఈశ్వర్‌సింగ్ ఠాగూర్, సింగాయిపల్లి గోపి, మురళీయాదవ్, రమేష్‌గౌడ్, సురేష్ పాల్గొన్నారు.

పోలింగ్‌పై అవగాహన ఉండాలి : కలెక్టర్



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఓటింగ్ యంత్రాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో సెక్టోరియల్, నోడల్, పోలింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలోకి ఫోన్ అనుమతించవద్దని ఆదేశించారు. ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు కార్డు పొందిన విలేకరులకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. అనంతరం ఈవీఎంలను సిద్ధం చేయడం, పోలింగ్ నిర్వహణ, ఈవీఎంల రవాణా, మాక్ పోలింగ్, రూట్ ఆఫీసర్ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణపై డెమో ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు జయచంద్ర, అంబాదాస్ రాజేశ్వర్, సెక్టోరల్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కమీషన్ల ప్రభుత్వం

మైనంపల్లి హన్మంతరావు



ప్రచారం నిర్వహిస్తున్న మైనంపల్లి

రామాయంపేట/ నిజాంపేట (మెదక్): మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో ప్రారంభించారు. ఆయన తండ్రి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం దళిత కాలనీలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ ప్రస్తుత మెదక్ ఎమ్మెల్యే ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేసి తన కుటుంబ అభివృద్ధి చూసుకుంటున్నారని ఆరోపించారు. భూకబ్జాలకు పాల్పడుతూ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. రోజుకో కేసు పెట్టుకున్నా తాము ఖాతరు చేయమని, ఉద్యమకారులకు తీరని అన్యాయం చేశారని తెలిపారు. దళితబంధు పేరిట ప్రభుత్వం ప్రజలను మోసగించిందని ఆయన పేర్కొన్నారు. ఇది కమీషన్ల ప్రభుత్వమని ఆరోపించారు.

నేడు సిద్దిపేటలో ప్రజా ఆశీర్వాద సభ

సాక్షి, సిద్దిపేట: పురిటి గడ్డ సిద్దిపేటకు బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రానున్నారు. సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట ప్రగతి ప్రజా ఆశీర్వాద సభను మంగళవారం సాయంత్రం నిర్వహించనున్నారు. సిరిసిల్ల సభ అనంతరం హెలికాప్టర్‌లో సిద్దిపేటకు రానున్నారు. సభను సిరిసిల్ల రోడ్డులోని నాగదేవత ఆలయం వద్ద నిర్వహిస్తున్నారు. లక్ష మందితో సభను నిర్వహించేలా భారీ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సభాస్థలిని మంత్రి హరీశ్‌రావు సందర్శించి దిశానిర్దేశం చేశారు.

గులాబీమయం..

సొంత గడ్డకు సీఎం కేసీఆర్ వస్తుండటంతో ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సిద్దిపేట పట్టణంలో, సభ ప్రాంగణంలో హోర్డింగ్‌లు, సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు చిత్రాలతో కూడిన కటౌట్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలను గులాబీమయం చేశారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 20వేల మంది యువత బైక్‌ల మీద సభకు, అలాగే పట్టణానికి చెందిన ప్రజలు సభకు చేరుకోనున్నారు.

రాజుకుంటున్న అసంతృప్తి

కాంగ్రెస్ టికెట్ల ప్రకటనతో.. రగులుతున్న అసమ్మతి నేతలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : కాంగ్రెస్ అభ్యర్థిత్వాల ప్రకటనతో అసంతృప్తి రాజుకుంటోంది. జిల్లాలో ఆయా నియోజకవర్గాల టికెట్లు ఆశించి భంగపడిన నాయకులు అంతర్గతంగా రగిలిపోతున్నారు. ఆదివారం కాంగ్రెస్ అధినాయకత్వం రాష్ట్రవ్యాప్తంగా 55 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ తొలి జాబితా ప్రకటించింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి గజ్వేల్, మెదక్ టికెట్లను వరుసగా తూంకుంట నర్సారెడ్డికి, మైనంపల్లి రోహిత్‌కు కేటాయించింది. అందోల్‌కు సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ, సంగారెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్‌కు మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్‌ను ప్రకటించింది. తొలివిడతలో ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. వీటి ప్రకటనతో టికెట్ ఆశించిన భంగపడిన నేతలు తీవ్రంగా రగిలిపోతున్నారు. ఈ అసంతృప్తి బహిర్గతం కాకపోయినప్పటికీ లోలోపల రాజుకుంటున్నది.

గజ్వేల్.. జశ్వంత్‌రెడ్డి వర్గం

గజ్వేల్ టికెట్‌ను తూంకుంట నర్సారెడ్డి, పీసీసీ డెలిగేట్ సభ్యుడు జశ్వంత్‌రెడ్డి ఆశించారు. ఆయనకు దక్కడంతో జశ్వంత్ వర్గం లోలోపల రగిలిపోతున్నారు. నర్సారెడ్డికి టికెట్ ఇవ్వొద్దంటూ గతంలో గాంధీభవన్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించింది. అంతకు ముందు ఇక్కడ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు ఏకంగా బాహాబాహీకి దిగాయి. ఇప్పుడు టికెట్ల ప్రకటనతో అసంతృప్తులు బయట పడకపోయినప్పటికీ అంతర్గతంగా రగిలిపోతున్నారు.

కాంగ్రెస్‌కు దూరంగా మ్యాడం బాలకృష్ణ

మెదక్ టికెట్ మైనంపల్లి రోహిత్‌కు ఖరారవుతుందనే సంకేతాలుండగా కాంగ్రెస్ నియోజకవర్గ ముఖ్యనేతలు డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. మిగతా ముఖ్యుల్లో ఒకరైన పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ ప్రస్తుతానికి స్తబ్ధతగా ఉన్నారు. రోహిత్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరో సీనియర్ నేత సుప్రభాతరావుకు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సముచిత స్థానం ఉంటుందని సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ భరోసా ఇవ్వడంతో రోహిత్‌కు మద్దతు పలుకుతున్నారు. జహీరాబాద్ అభ్యర్థిత్వం చంద్రశేఖర్‌కు ఖరారు చేయగా ఇదే స్థానం కోసం దరఖాస్తు చేసుకున్న స్థానిక నాయకులు అసంతృప్తితో ఉన్నారు. అధిష్టానం దశాబ్దాలుగా నియోజకవర్గాన్ని స్థానికేతరులకే కేటాయిస్తే, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేస్తున్న తమకు ఎప్పుడు అవకాశం వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

ఆరు చోట్ల

నారాయణఖేడ్‌లో మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, సంజీవరెడ్డి ఆశిస్తున్నారు. నర్సాపూర్‌లో గాలిఅనిల్‌కుమార్, ఆవుల రాజిరెడ్డి, పటాన్‌చెరులో కాటా శ్రీనివాస్‌గౌడ్, గాలిఅనిల్ ఇద్దరూ కోరుతున్నారు. దుబ్బాకలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కత్తి కార్తీక పోటీ పడుతున్నారు. సిద్దిపేట్‌లోనూ ఇద్దరు నాయకులు టికెట్ రేసులో ఉన్నారు. అవి ప్రకటిస్తే ఎట్టి పరిస్థితుల్లో అసంతృప్తులు భగ్గుమనే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.

రెండో జాబితాతో భగ్గుమనే అవకాశాలు

ఉమ్మడి జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు టికెట్‌లు ఖరారయ్యాయి. మిగిలిన ఆరు చోట్ల అభ్యర్థిత్వం ఎంపిక కొంత క్లిష్టంగా మారగా కాంగ్రెస్ అధినాయకత్వం ఈ ఆరింటినీ రెండో, మూడో జాబితాల్లో ప్రకటించాలని యోచిస్తోంది. పెద్దగా ఇబ్బందులు లేని టికెట్‌ల విషయంలోనే అసంతృప్తులు అంతర్గతంగా రగిలిపోతున్నారు. ఇంకా ఆరు టికెట్‌ల విషయంలో అసమ్మతి భగ్గుమనే అవకాశాలు లేకపోలేదని తెలుస్తోంది. ఈ స్థానాలను ఇద్దరు, ముగ్గురు నాయకులు కూడా ఆశిస్తున్నారు. ఒకరి అభ్యర్థిత్వం ఖరారు చేస్తే వ్యతిరేకవర్గం నుంచి తీవ్రస్థాయిలో అసంతృప్తి రగిలే అవకాశాలే కనిపిస్తున్నాయి.

క్లుప్తంగా

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం


హనుమంతు(ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్‌ కానిస్టేబుల్‌ శంకర్‌ కథనం ప్రకారం.. పట్టణంలోని గౌతమ్‌నగర్‌ కాలనీకి చెందిన వడ్డే హనుమంతు(65) సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య వడ్డె దేవమ్మ తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఆమె ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.8.08 లక్షల నగదు పట్టివేత


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): స్థానిక ఇక్రిశాట్‌ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌ పోస్ట్‌ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి పోలీసులు భారీగా నగదును పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా ఇద్దరు వ్యక్తులు కారులో తరలిస్తున్న రూ.8,08,430లను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ నరేందర్‌ రెడ్డి మాట్లాడుతూ వాహన తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు ఎలాంటి పత్రాలు లేకుండా నగదును తీసుకు వెళ్లడంతో స్వాధీనం చేసుకుని జిల్లా ఎలక్షన్‌ కమిషన్‌ అధికారులకు పంపించామని చెప్పారు. చెక్‌ పోస్ట్‌ వద్ద 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నామని, అనుమతులు లేకుండా నగదు తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిందితుడికి జీవిత ఖైదు

రూ.వెయ్యి జరిమానా

మునిపల్లి(అందోల్‌): ఇబ్రహీంపూర్‌కు చెందిన ల్యాగల శ్రీనివాస్‌ తన భార్య రాణమ్మను నిత్యం అనుమానిస్తూ వేధించడంతో ఆమె మృతి చెందింది. కోర్టులో నేరం రుజువు కావడంతో శ్రీనివాస్‌కు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి కృష్ణార్జున్‌ సోమవారం జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. రాణమ్మ మరణానికి కారణమైన ఆమె భర్త ల్యాగల్‌ శ్రీనివాస్‌పై రాణమ్మ తల్లి శ్యామమ్మ 2019లో బుదేరా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కోర్టులో నేరాన్ని రుజువు చేయడంతో జడ్జి నిందితుడికి శిక్ష విధించారు.

పార్ట్‌టైం జాబ్‌ పేరుతో సైబర్‌ వల

పటాన్‌చెరు టౌన్‌: పార్ట్‌టైం జాబ్‌ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్‌ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి రూ.2,74,691 పోగొట్టుకున్నాడు. ఈ ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌ మండల పరిధిలోని భవానిపురం కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్‌ అంటూ జూన్‌ 21న మెసేజ్‌ వచ్చింది. దానికి అనుగుణంగా ఆయన తన వివరాలను నమోదు చేశాడు. సైట్‌ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్‌ ఐడీ క్రియేట్‌ చేసి ఇచ్చారు. ఉద్యోగి రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తిచేయడం మొదలుపెట్టాడు. తన నగదును సైబర్‌ నేరగాళ్లు ఆయన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.2,74,691 చెల్లించాడు. తన నగదు, కమీషన్‌ ఇవ్వాలంటూ పట్టుపట్టే సరికి సైబర్‌నేరగాళ్లు స్పందించలేదు. దీంతో ఆ ఉద్యోగి మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్‌ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్‌ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌ పథకాలనే బీఆర్‌ఎస్‌ కాపీ కొట్టింది

- ఉత్సవ విగ్రహంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌
- గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేయడంలో విఫలం
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌


మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌

హుస్నాబాద్‌: కాంగ్రెస్‌ ఆరు గ్యారంటీల పథకాలను విమర్శిస్తూ బీఆర్‌ఎస్‌ నేతలే వాటికి బ్రాండ్‌ అంబాసిడర్లుగా మారారని, తీన్‌ పత్తా ఆడినట్లు కాంగ్రెస్‌ పథకాలనే కాపీ కొట్టారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ ఎద్దేవాచేశారు. స్థానిక కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌లో ఆదివారం జరిగిన సెంట్‌మెంట్‌ సభలో సీఎం కేసీఆర్‌ చేసిన ప్రసంగంలో పస లేదని విమర్శించారు. ఓటమిని ముందుగానే గమనించిన సభగా మారిందన్నారు. ముఖ్యమంత్రి హుస్నాబాద్‌కు వస్తే ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ ఆయన పక్కనే ఉత్సవ విగ్రహంగా నిలబడి, సమస్యలను పరిష్కరించాలని చెప్పే సాహసం చేయలేదన్నారు. అలాంటి ఆయనకు ఎమ్మెల్యేగా పోటీచేసే అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.400లకే గ్యాస్‌ సిలిండర్‌ ఇస్తామంటున్న సీఎం కేసీఆర్‌ 2018 నుంచి ఇప్పటి వరకు రూ.400 పోను రూ.800 చెల్లిస్తేనే ప్రజలు నమ్ముతారన్నారు. ఎల్కతుర్తిలో బస్టాండ్‌ పనుల విషయం మాట్లాడుతూ ఎమ్మెల్యే స్థాయిలో జరగాల్సిన పనులను ముఖ్యమంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకొనిపూర్తి చేస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్‌ పదేళ్ల కాలయాపన చేసి, మళ్లీ అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో పూర్తి చేస్తాననడం వైఫల్యం చెందినట్టు కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అభివృద్ధి చెందాల్సిన కొత్తకొండ ఆలయం, ఎల్లమ్మ దేవాలయం, పొట్లపల్లి, సింగరాయ దేవాలయాలు అభివృద్ధి చెందలేదని వాపోయారు. అలాగే పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌, డీఎస్సీ, నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడం బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కేసీఆర్‌ 2018లో అమలు కాని హామీలు ఇచ్చారని, ఇప్పుడు కూడా అదే విధంగా హామీలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. హుస్నాబాద్‌ ఉత్సవ విగ్రహంగా ఉన్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను మార్చి, ఈ ప్రాంత సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పే కాంగ్రెస్‌ పార్టీని ప్రజలు గెలిపించాలని పొన్నం ప్రభాకర్‌ కోరారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, అశోక్‌ రెడ్డి, డీసీసీ కార్యదర్శి ఎండీ హుస్సేన్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజని, సింగిల్‌ విండో వైస్‌ చైర్మన్‌ ఎగ్గిడి అయిలయ్య, నాయకులు మైదంశెట్టి వీరన్న, వెన్న రాజు, కిష్టస్వామి, బోనగిరి రజిత, భిఖ్యా నాయక్‌ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్‌: రాష్ట్రంలో జరగనున్న సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధి ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి ప్రజా ప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాగంగా ప్రచారం కోసం చేసే ఖర్చులను ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ విడుదలై నామినేషన్‌ వేసే నాటి నుంచి అభ్యర్థుల ఖాతాలో ఖర్చులను లెక్కించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఉపయోగించే వాహనాలు, వస్తువులు, ఆహార పదార్థాలకు, ఇతర ఖర్చులను కూడా లెక్కించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం సూచించిన ధరలను పరిశీలించి స్థానిక డిమాండ్‌ను బట్టి ఆయా వస్తువులకు ఉండాల్సిన ధరల విషయంలో సూచనలు, సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌పార్టీ ప్రతినిధి మోహన్‌లాల్‌, బీజేపీ ప్రతినిధి శ్రీనివాస్‌, ఎంఐఎం పార్టీ నుంచి మునీర్‌, వైఎస్సార్‌సీపీ నుంచి టి.జగదీశ్వర్‌గుప్తా, కాంగ్రెస్‌ పార్టీ నుంచి గ్రేస్‌ మధు, డీఆర్‌ఓ నాగరాజమ్మ, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ అమృత్‌సేనారెడ్డి, ఆర్డీఓ జనార్దన్‌రెడ్డి, డీఎస్‌ఓ తనూజ తదితరులు పాల్గొన్నారు.

విధులు సమగ్రంగా నిర్వహించాలి...
– అధనపు కలెక్టర్‌ గరీమా అగర్వాల్‌


గరీమా అగర్వాల్‌

దుబ్బాకటౌన్‌: ఎన్నికల విధులు సమగ్రంగా నిర్వహించాలని అడిషనల్‌ కలెక్టర్‌, దుబ్బాక నియోజక వర్గం ఆర్‌ఓ గరీమా అగర్వాల్‌ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐఓసీ కార్యాలయంలో సోమవారం ఎన్నికల విధులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక టీంలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, విధుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా బాధ్యులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలన్నారు.

ఆర్డినెన్స్‌ ఫ్యాక్టరీని సందర్శించిన కేడెట్లు


కేడెట్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గజ్వేల్‌రూరల్‌: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్‌ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న స్పెషల్‌ నేషనల్‌ ఇంటిగ్రేషన్‌ క్యాంపు కేడెట్లు సోమవారం క్షేత్ర పర్యటనలో భాగంగా సంగారెడ్డి సమీపంలోని ఆయుధ రక్షణ పరిశ్రమను సందర్శించినట్టు క్యాంప్‌ కమాండెంట్‌ కల్నల్‌ సునీల్‌ అబ్రహం తెలిపారు. పరిశ్రమ బ్రాంచ్‌ సీనియర్‌ మేనేజర్‌ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాడెట్లకు యుద్ధ నౌకలు, ఫిరంగులు, జలాంతర్గాములు నిర్మాణం వంటి వాటిపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. అదే విధంగా వారికి వాలీబాల్‌, సాంస్కతిక పోటీలు నిర్వహించినట్టు క్యాంప్‌ డిప్యూటీ కమాండెంట్‌ కల్నల్‌ పీఎస్‌ నందా తెలిపారు. 150 మంది కేడెట్లు ఫైరింగ్‌లో పాల్గొన్నట్టు క్యాంపు కమాండెంట్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. నాలుగు రోజులుగా జరుగుతున్న క్యాంపులో వివిధ రాష్ట్రాలకు చెందిన 303 ఎన్‌సీసీ కాడెట్లతో పాటు 20 మంది ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నట్టు లెఫ్టినెంట్‌ కల్నల్‌ పినాకి తెలిపారు.

నర్సాపూర్‌లో టిక్కెట్ల అయోమయం

- అభ్యర్థులను ప్రకటించని పార్టీలు
- కొనసాగుతున్న ఉత్కంఠ
- కార్యకర్తలు, నాయకుల్లో గందరగోళం



నర్సాపూర్‌: ఎన్నికల నోటిఫికేషన్‌ వచ్చినా నర్సాపూర్‌ నియోజక వర్గానికి ఏ రాజకీయ పార్టీ ఇంకా తమ అభ్యర్థులను ప్రకటించక పోవడంతో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలలో అయోమయం నెలకొంది. బీఆర్‌ఎస్‌ పార్టీ ఇప్పటికే 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆదివారం సీఎం కేసీఆర్‌ 51 స్థానాలకు సంబంధించిన తమ అభ్యర్థులకు బి ఫారాలు కూడా అందజేశారు. అలాగే కాంగ్రెస్‌ పార్టీ కూడా 55 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించింది. వాటిలో నర్సాపూర్‌కు సంబంధించిన అభ్యర్థుల ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

బీఆర్‌ఎస్‌ జాబితాలో నర్సాపూర్‌ లేదు..

బీఆర్‌ఎస్‌ అధినేత, సీఎం కేసీఆర్‌ 51 స్థానాలకు సంబంధించిన ఆ పార్టీ అభ్యర్థులకు బి ఫారాలను అందజేశారు. అందులో నర్సాపూర్‌ అభ్యర్థి పేరు లేకపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలలో నెలకొన్న అయోమయం అలానే కొనసాగుతోంది. నర్సాపూర్‌ బీఆర్‌ఎస్‌ టికెట్‌ రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డికి ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ ఖరారు చేసినట్టు రాష్ట్ర మంత్రులు కేటీఆర్‌, హరీశ్‌ రావు ఆ విషయాన్ని సిట్టింగ్‌ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి చెప్పగా ఆయన ఒప్పుకోలేనట్టు ప్రచారం జరిగింది. ఆయనను ప్రగతి భవన్‌కు పిలిచి చర్చించి ఏ నిర్ణయం చేయకుండా పంపేశారని కూడా ప్రచారం జరిగింది.

అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్‌..

కాంగ్రెస్‌ పార్టీ ఆదివారం 55 మంది అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో సైతం పలు స్థానాలకు ప్రకటించగా నర్సాపూర్‌ స్థానానికి అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఆ పార్టీ నాయకులలో గందరగోళం నెలకొంది. టికెట్‌ ప్రస్తుతం పార్టీలో ఉన్న వారికే ఇస్తారా లేక ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి ఇస్తారా అనే సందేహాలు ఆ పార్టీ నాయకులను వెంటాడుతోంది. జాబితాలో తన పేరు లేకపోవడంతో టికెట్‌ ఆశిస్తున్న గాలి అనిల్‌కుమార్‌ ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లారని తెలిసింది. ఆయనతో పాటు ఆవుల రాజిరెడ్డి కూడా జోరుగా పైరవీలు చేస్తున్నారని సమాచారం. బీఆర్‌ఎస్‌ నర్సాపూర్‌ టికెట్‌ను సిట్టింగ్‌ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఇవ్వకపోతే ఆయన బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతోంది. ఆయన కోసమే కాంగ్రెస్‌ నర్సాపూర్‌ స్థానానికి అభ్యర్థిని ప్రకటించకుండా వాయిదా వేసిందని అనుకుంటున్నారు.

బీజేపీలో కూడా తేలని నిర్ణయం..

రాష్ట్రంలో బీజేపీ ఇంకా తన అభ్యర్థులను ఎక్కడా ప్రకటించలేదు. దీంతో నర్సాపూర్‌ టికెట్‌ ఆశిస్తున్న నాయకులతో పాటు పార్టీ నాయకులలో అయోమయపరిస్థితి నెలకొంది. పార్టీకి చెందిన ఎనిమిది మంది నాయకులు టికెట్‌ కోసం దరఖాస్తు చేయగా పార్టీ రాష్ట్ర అధిష్టానం ఐదుగురికి నచ్చ చెప్పి విరమింప చేసిందని సమాచారం. అందులో మురళీయాదవ్‌, గోపి, రఘువీరారెడ్డి పేర్లను రాష్ట్ర పార్టీ ఖరారుచేసి కేంద్ర పార్టీకి నివేదించిందని తెలిసింది. ఆ ముగ్గురులో ఎవరికి టికెట్‌ వస్తుందోనని నాయకులతో పాటు వారి అనుచరులలో ఉత్కంఠ కొనసాగుతోంది.

జనగామ సభకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి..


జనగామలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్‌ వెంట మదన్‌రెడ్డి

జనగామలో నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ వెళుతూ ప్రగతి భవన్‌కు వచ్చిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని తన వెంట తీసుకువెళ్లారు. దీంతో టికెట్‌ సునీతా రెడ్డికి ఇవ్వనున్న విషయాన్ని వివరించి ఒప్పించి, ఆయనకు మరేదైనా పదవి ఇచ్చి బుజ్జగించడానికే తీసుకువెళ్లారా? అనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని బుజ్జగించే పనులు పూర్తవగానే సునీతారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించి బి ఫారం అందజేసే అవకాశం ఉందని పార్టీలో పలువురు నాయకులు అనుకుంటున్నారు.

చెరువులోకి దూకి ఒకరి మృతి


ఘటనా స్థలంలో పోలీసు అధికారి

హవేళిఘణాపూర్‌ (మెదక్‌): కుటుంబల కలహాలు, అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన ఒక వ్యక్తి చెరువులోదూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని సర్దన గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కట్ట వెంకటేశం(35) తన భార్య లక్ష్మి మృతి చెందగా మరో మహిళతో వివాహం చేయగా ఆమె ఇటీవల వెంకటేశంతో గొడవపడి వెళ్లిపోయిందని వెంకటేశం తల్లి నర్సమ్మ తెలిపింది. దానికి తోడు ఆయనకు ఫిట్స్‌ వ్యాధి ఉండడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 14న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, సోమవారం ఐలేరు చెరువులోపడి మృతి చెందినట్లు చెప్పింది. నర్సమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితంలేని వివాహిత..

కౌడిపల్లి(నర్సాపూర్‌): మతిస్థిమితంలేని వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కౌడిపల్లి మండలం ముస్రాజ్‌పల్లిలో సోమవారం జరిగింది. స్థానిక ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సున్నం రవీందర్‌కు ఇద్దరు భార్యలు. చిన్న భార్య విజయలక్ష్మి(45)కి కొన్నేళ్లుగా మతిస్థితమితం సరిగా లేకపోవడంతో చికిత్స చేయించుకుంటోంది. అప్పడప్పుడు ఆత్మహత్య చేసుకుంటానని చెపుతుండేది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త సున్నం రవీందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలుకింద పడి..

చేగుంట(తూప్రాన్‌): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడియారం రైల్వేస్టేషన్‌ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిన వివరాల ప్రకారం.. వడియారం స్టేషన్‌ సమీపంలో లూప్‌లైన్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 45 ఏళ్లుంటాయని చెప్పారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించామని, బంధువులు ఎవరైనా ఉంటే కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ తావూనాయక్‌ కోరారు.

సీఎం నోట.. చేర్యాల డివిజన్‌ మాట

ఏళ్ల కల సాకారం కానుందా?



చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల్లో గెలిచిన నెల రోజుల్లోపు చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తానని సీఎం కేసీఆర్‌ మాటిచ్చారు. కేసీఆర్‌ ప్రకటనతో చేర్యాల ప్రాంత ప్రజల ఏడేళ్ల వల నెరవేరనుంది. సోమవారం జనగామలో జరిగిన బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి సిద్దిపేట జిల్లాలో కలిసిన చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల ప్రజలు డివిజన్‌ స్థాయి కార్యాలయాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి డివిజన్‌ ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్‌ స్పందిస్తూ ఎన్నికల్లో పల్లాను గెలిపిస్తే నెల రోజుల్లోపు చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తానని మాటిచ్చారు. సీఎం కేసీఆర్‌ ప్రకటనతో గత ఏడేళ్లుగా కొనసాగుతున్న రెవెన్యూ డివిజన్‌ సాధన పోరాటానికి ఫలితం దక్కుతుందన్న నమ్మకం కలిగిందని చెప్పవచ్చు.

ఈ ప్రాంత ప్రజల విజయం..



చేర్యాల రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు అంశం సీఎం కేసీఆర్‌ నోటి వెంట రావడం ఈ ప్రాంత ప్రజల మొదటి విజయంగా చెప్పవచ్చు. ఇటీవల ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజన్‌లలో చేర్యాలను చేయకపోవడం బాధాకరం. నేడు ఎన్నికలయ్యాక ఏర్పాటు చేస్తామనడం సబబుకాదు.

– రామగల్ల పరమేశ్వర్‌, జేఏసీ చైర్మన్‌

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు..



చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల వాంచైన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తానని మాటిచ్చిన సీఎం కేసీఆర్‌కు ఈ ప్రాంత ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు.

– ముస్త్యాల బాల్‌నర్సయ్య, రిటైర్డ్‌ ఆర్‌అండ్‌బీ ఈఈ, చేర్యాల


బీఆర్‌ఎస్‌లో విభేదాల రగడ

- కార్యకర్తల వాగ్వాదం.. తోపులాట
- తలలు పట్టుకున్న ముఖ్య నేతలు
- అర్ధంతరంగా ముగిసిన సమావేశం


బాహాబాహీకి దిగిన కార్యకర్తలు, నాయకులు


కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లి మండలంలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యకర్తల సమావేశంలో గ్రూపు రాజకీయాలు భగ్గుమన్నాయి. మండలంలోని చిన్న కిష్టాపూర్‌ గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌ హాల్లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్‌ చిట్టి దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా కుకునూరుపల్లి మండలం కొండపాక, జగదేవ్‌పూర్‌ మండలాల నుంచి కొందరి ప్రజా ప్రతినిధులు, నాయకుల సమన్వయంతో ఏర్పడిందని, కానీ ఒకరిద్దరి వల్లే ఏర్పడిందంటూ గొప్పలు చెప్పుకుంటూ పెత్తనం చెలాయిస్తున్నారంటూ కార్యకర్తలు సమావేశంలో ప్రస్తావించారు. అలాగే గ్రామాల్లో నూతన బూత్‌ కమిటీల ఏర్పాటులో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, నాయకులకు సమాచారం లేకుండా పెత్తనం చెలాయిస్తున్న ప్రజా ప్రతినిధే ప్రక్రియను పూర్తిచేసి నేతలకు అప్పగించారంటూ కొందరు సమావేశం దృష్టికి తెచ్చారు. దీంతో ఆ నాయకుడి అనుచరులకు, మిగతా నాయకులకు ప్రారంభమైన వాగ్వాదం తోపులాటకు దారి తీసింది. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో అందరినీ కలుపుకు పోయేలా నియోజకవర్గ స్థాయి నేతలు చూడాలని లేకపోతే పార్టీకి ఎదురుదెబ్బ తప్పదని కొందరు అతిథులకు విన్నవించారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థతి నెలకొంది. బూత్‌ కమిటీలను ఏర్పాటు చేయడంలో అందరినీ కలుపుని పోవాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి నచ్చచెప్పారు. దీంతో గొడవ సద్దుమణిగింది. కాని సమావేశం అర్ధాంతరంగా ముగియడంతో కొంత మంది కార్యకర్తలు, నాయకులు అసహనాన్ని వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా 'బ్యాగ్‌లెస్‌ డే'


పరిసరాలను శుభ్రంచేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు పుస్తకాలతో కుస్తీకి విరామం దొరికింది. నిత్యం చదువుల భారంతో టెన్షన్‌ పడే విద్యార్థులకు 'బ్యాగ్‌లెస్‌ డే' కార్యక్రమం కాస్త రిలాక్స్‌ తెచ్చింది. వర్గల్‌ నవోదయలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చదువు జోలికి వెళ్లకుండా ఐదు రోజులు విద్యార్థులు స్పోర్ట్స్‌, గేమ్స్‌ తదితర యాక్టివిటీస్‌లో నిమగ్నమవుతారని ప్రిన్సిపాల్‌ రాజేందర్‌ తెలిపారు. విద్యార్థులు మొదటి రోజు పరిసరాల శుభ్రత, ఆటలు, నృత్యంలో పాల్గొన్నారు. గెస్ట్‌ లెక్చరర్‌ రజనీ మోటివేషనల్‌ ఉపన్యాసం విద్యార్థుల్లో ఉత్సాహం నింపింది. బతుకమ్మ ఆటలో బాలికలు మునిగిపోయారు.

– వర్గల్‌(గజ్వేల్‌)


నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థినులు